PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 99 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 06 ఏప్రిల్ 2026


## బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



3లో


## తల్లి జ్ఞాపకార్థం సేవా సుగంధం



3లో

# విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

### - అసోం సభలో రాహుల్ గాంధీ విమర్శ



**గౌహతీ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల మధ్యన విభజన తీసుకొచ్చి రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపీ విద్వేషం వ్యాప్తి చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో అసోంలోని బిశ్వనాథ్ చరియాలీలో ఆదివారం నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను విద్వేషం విరజిమ్మే నేతగా ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే.. హిమంత క్షమాపణలు కోరినా.. వదిలిపెట్టబోమని, చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మిగతా2లో...

# ఎల్పీజీ కష్టాలు




2లో

- కిలో రూ.500కి చేరిక
- భారంగా 'ఛోటా' సిలిండర్
- పేదలు, వలస కార్మికులకు తప్పని తిప్పలు
- బ్లాక్ మార్కెట్ దందాను కట్టడి చేయలేని ప్రభుత్వాలు

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

- రెస్క్యూ విమానాన్ని కూల్చేసిన ఇరాన్..ఐదుగురు మృతి
- దిగిరాకుంటే నరకమే : ట్రంప్ అల్టిమేటం
- పట్టించుకోని టెహ్రాన్
- గల్ఫ్‌పై కొనసాగుతున్న దాడులు



**ఇరాన్, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో అమెరికా దళాలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేయడం, దానిలో ఉన్న ఇద్దరు పైలట్లలో ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రెస్క్యూ విమానాన్ని కూడా కూల్చేశామని మిగతా2లో...

# నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు దిక్సూచి

● బుద్వేలులో హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన ● కార్యనిర్వాహక వ్యవస్థతో కలిసి పనిచేయాలి ● అప్పుడే రాజ్యాంగం సజీవం: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాజ్యాంగం సజీవంగా ఉండాలంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ లక్ష్యాల విషయంలో ఏకీభవించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలనేవి ఐచ్ఛికం కాదనీ, అత్యవసరమేననీ, వాటిని బలోపేతం చేయటం తప్పనిసరి అని అన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషిని కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని బుద్వేల్‌లో రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి జస్టిస్ సూర్యాకాంత్ మిగతా2లో...




# భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

### ఆరు శాతానికి తగ్గింపు : మూడీస్ నివేదిక

**న్యూఢిల్లీ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మూడీస్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను 6శాతానికి తగ్గించింది. గతేడాది ఆర్థిక వృద్ధి 6.8 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో వృద్ధి వేగం మందగిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉందని మూడీస్ పేర్కొంది. భారతదేశ క్రెడిట్ రేటింగ్స్‌పై నివేదికను మూడీస్ ఆదివారం విడుదల చేసింది. యుద్ధం కారణంగా దీర్ఘకాలిక అంతరాయాలు ముఖ్యంగా ఎల్పీజీ రవాణా కారణంగా భవిష్యత్తులో గృహాలకు ఎల్పీజీ కొరత, అధిక ఇంధన, రవాణా ఖర్చులకు అలాగే దిగుమతి చేసుకున్న ఎరువులపై భారత్ ఆధారపడటంతో ఆహార ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని పేర్కొంది."పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అధిక ధరలు, పెరిగిన మిగతా2లో...

# నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

- 373 ఎకరాల భూమిని తన్నుకుపోతున్న కాంగ్రెస్ పెద్దలు
- కబ్జా కంపెనీల వెనుక మంత్రి పొంగులేటి కుటుంబం
- అధికార పార్టీ నేతల ఆక్రమణలు హైడ్రాకు కనిపించడం లేదా?
- ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో అక్కడికి వెళ్తాం : మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక




2లో

# జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

### - ఏపీ మంత్రుల తీవ్ర విమర్శలు




**అమరావతి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోందని పార్థసారథి వ్యాఖ్యానించారు. విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు మిగతా2లో...

# నేడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం

- కమలనాథులు చురుగ్గా పాల్గొనాలి
- ప్రతి ఇంటిపై జెండా రెపరెపలాడాలి: పార్టీ చీఫ్ రాంచందర్ రావు పిలుపు



**హైదరాబాద్ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమ వారం (6న) పార్టీ శ్రేణులు పార్టీ నిర్దేశిం చిన వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, ఇంటి యజమాని అనుమతితో వారి ఇంటిపై పార్టీ జెండా ఎగుర వేయాలని ఆయన సూచించారు. దీంతో జాతీయ గౌరవ భావన, ప్రజా భాగస్వామ్యం, పార్టీ పట్ల ప్రజల ఆత్మీయ అనుబంధం మరింత బలపడుతోంది. అనేక ప్రాంతాల్లో ఈ కార్యక్రమానికి ఎంతో సానుకూల స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు.దేశవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు ఘనంగా జరుపుకోనున్నారని ఆయన చెప్పారు. వేడుకలకు ముందు రోజే ప్రతి బూత్‌లో, ప్రతి ప్రాంతంలో పార్టీ కార్యకర్తలు ఇప్పటికే పార్టీ జెండాను ఆవిష్కరించడం ప్రారంభించి, పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి మిగతా2లో...




# తెలంగాణ సక్సెస్‌ఫుల్ స్టార్టప్

ఎఐ, లైఫ్‌సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్ తదితర రంగాల సమ్మేళనంతోనే వృద్ధి సాధ్యం విదేశాల్లోని మన విద్యార్థులు, నిపుణులు భారత అభివృద్ధిలో భాగస్వాములు కావాలి కొలంబియా బిజినెస్ స్కూల్ 'ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్'లో కెటిఆర్ ప్రసంగం

**హైదరాబాద్ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభివర్ణించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో జరిగిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను మిగతా2లో...

# ఆప్ నేతలకు రాఘవ చద్దా కౌంటర్

### - సినిమా ఇంకా ఉందని వీడియోలతో ఎదురుదాడి



**న్యూఢిల్లీ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పంజాబ్ వేదికగా ఆమ్ ఆద్మీపార్టీలో సంక్షోభం ముదిరింది. ఆప్ రాజ్యసభ సభ్యులు ఎంపి రాఘవ చద్దా ఆదివారం పార్టీ నాయకత్వంపై ఎదురుదాడికి దిగారు. సినిమా అయిపోలేదు. ఇంకా మిగిలే ఉంది. పైగా ఇప్పుడే అసలు సినిమా అంటూ వీడియోలు విడుదల చేశారు. పార్లమెంట్‌లో పంజాబ్ సమస్యలను రాఘవ ప్రస్తావించడం లేదనే పార్టీ అంతర్గత వాదనను

మిగతా2లో...

# ఎల్పీజీ కష్టాలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మధ్యప్రాచ్య యుద్ధం వల్ల ఎల్పీజీ సరఫరా తీవ్రంగా ప్రభావితమైంది. 14.2 కిలోల గృహ సిలిండర్ బ్లాక్ మార్కెట్‌లో రూ.3000 వరకు అమ్ముడవుతోంది. అధికార ధర మాత్రం రూ.914 మాత్రమే. 5 కిలోల సిలిండర్ రీఫిల్ ధర కిలోకు రూ.400-500కు పెరిగింది. ఈ పరిస్థితిలో చిన్న సిలిండర్ ధర పెద్దదాని కంటే ఎక్కువైంది. అందుకే 'ఛోటా' సిలిండర్ ఇప్పుడు 'పెద్దది'గా మారిందని భావిస్తున్నారు. వలసకార్మికులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు ఈ ఐదు కిలోల సిలిండర్‌పై ఆధార పడుతుంటారు. కానీ ప్రస్తుత ధరల వల్ల రీఫిల్ చేయించడం మోయలేని భారంగా మారుతోంది. నోయిడాకు చెందిన పునీత్‌కుమార్ తన పాత ఐదు కిలోల చోటు సిలిండర్‌ను తిరిగి ఉపయోగించాలని భావించాడు. కానీ ఎల్పీజీ కొతర కారణంగా దాన్ని రీఫిల్ చేయించుకోలేకపోయాడు. ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో, సాధారణ 14 కిలోల సిలిండర్ కోసం వేచి ఉండడమే మంచిదనుకున్నాడు. నోయిడాలోని రాహుల్ రంజన్ కూడా కిలోకు రూ.400 చెల్లించాలని అడిగారని చెప్పారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) చట్టబద్ధంగా 'చోటు', 'మినీ', 'అప్పు' అనే ఐదు కిలోల సిలిండర్లను అందిస్తున్నాయి. కానీ వాటి లభ్యత సమస్యగా మారడం ఆందోళనకరమని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రభుత్వం సరఫరా నిలకడగా ఉంటుందని చెప్పినా.. చాలా చోట్ల పది నుంచి 45 రోజుల వరకు సిలిండర్ డెలివరీ ఆలస్యం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ కోసం ప్రజలు గొడవలకు దిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా చిన్న సిలిండర్‌పై ఆధారపడే వలస కార్మికులు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అధిక ధరల కారణంగా కొంతమంది తమ గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారు. నోయిడాలోని ఒక స్ట్రీట్ ఫుడ్ విక్రేత గ్యాస్ కొనలేక బొగ్గు స్టవ్‌కు మారాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ తర్వాత అతను స్వగ్రామానికి వెళ్లిపోయాడు. చిన్న సిలిండర్ ఒకప్పుడు మధ్యతరగతి వారికి గుర్తుగా ఉండేది. ఇప్పుడు అదే పేదలకు జీవనాధారం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో దాన్ని పొందడం కష్టమైంది. ముంబయి, ఢిల్లీ వంటి నగరాల్లో చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు ఈ సిలిండర్లపై ఆధారపడుతుంటారు. కానీ ఇప్పుడు వాటి రీఫిల్ ధరలు అధికంగా ఉండటంతో వ్యాపారం కొనసాగించడం కష్టమవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్లాక్ మార్కెట్ దందా సాగుతోంది. పోలీసులు బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా.. అక్రమ దందా మాత్రం ఆగటం లేదు. ప్రభుత్వం ఈ మినీ సిలిండర్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. వలస కార్మికులకు 30,000 సిలిండర్లు పంపిణీ చేశారు. మార్చి 23 తర్వాత 3.9 లక్షల సిలిండర్లు అమ్ముడయ్యాయి. అయితే ధర కూడా పెరిగి రూ.649కు ఎగబాకింది. ఈ సిలిండర్లు సులభంగా పొందవచ్చని కంపెనీలు చెప్తున్నా.. వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. చాలా చోట్ల అవి అందుబాటులో లేవని ప్రజలు చెప్తున్నారు. బుకింగ్ చేసినా స్టాక్ లేదని చెప్పడం, హెల్ప్‌లైన్ పని చేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ప్రకటించారు. పైలట్‌ను రక్షించామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ మీడియా ఓ వార్తను అందిం చింది. దాని ప్రకారం...కూలిపోయిన యుద్ధ విమానానికి చెందిన పైలట్ కోసం గాలింపు జరుపుతున్న అమెరికా రెస్క్యూ విమానం సీ-130ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ ధ్వంసం చేసింది. ఖతార్ మీడియా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. గాలింపు చర్యలు చేపట్టిన విమానాలకు రీఫ్యూయలింగ్ చేయడానికి సీ-130 వచ్చింది. అయితే అందులోని సిబ్బంది ఏమైందీ తెలియలేదు. గాలింపు సమయంలో ఇరాన్ దళాలు అనేక అమెరికా విమానాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా ఇరాన్ దళాలు జరిపిన దాడులలో ఐదుగురు చనిపోయారు. కూల్చివేతకు గురైన వాటిలో సీ-130 విమానంతో పాటు రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కూడా ఉన్నాయి. **పైలట్‌ను రక్షించాం : ట్రంప్** ఇరాన్‌లో చిక్కుపోయిన రెండో పైలట్‌ను రక్షించామని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతనిని గుర్తించారని, ప్రస్తు తం అతను అమెరికా బలగాల రక్షణలో ఉన్నాడని తెలిపా రు. పైలట్‌ను తీసుకొని రావడానికి ప్రపంచంలోనే అత్యం త ప్రాణాంతక ఆయుధాలతో అనేక విమానాలను పంపా మన్నారు. పైలట్ గాయపడినప్పటికీ కోలుకుంటు న్నాడని చెప్పారు. **ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులలో ఆ దేశానికి చెందిన పలువురు సీనియర్ సైనికాధికారులు చనిపోయారని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాడికి సంబంధించి ఒక నిమిషం ఏడు సెకన్ల నిడివి కలిగిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. అందులో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలము కున్నాయి. అయితే ఈ దాడులు ఎప్పుడు జరిగిందీ ట్రంప్ వెల్లడించలేదు. తమతో ఒప్పందం చేసుకొని, హార్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో నరకాన్ని చవిచూడాల్సి ఉంటుందంటూ హెచ్చరిక జారీ చేసిన తర్వాత ట్రంప్ ఈ వీడియోను విడుదల చేయడం గమనార్హం. ఇరాన్ కూడా ఈ దాడులపై ఇంతవరకూ స్పందించలేదు. ఇదిలావుండగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ కమాండర్ ఖస్సెమ్ సోలైమని బంధువుగా గుర్తించిన ఓ మహిళ శాశ్వత నివాస హోదాను అమెరికా రద్దు చేసింది. సొలైమని బంధువు హమిదెహ్ సొలైమని అఫ్షర్‌ను, ఆమె కుమార్తెను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారని, వారిని దేశం నుంచి బయటికి పంపే ప్రయత్నం జరుగుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. **కువైట్ చమురు సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి** గల్ఫ్‌లోని కువైట్‌పై ఇరాన్ ఆదివారం విరుచుకు పడింది. షువైఖ్ చమురు సెక్టార్ ప్రాంగణంపై డ్రోన్ దాడి జరిపింది.

# నేర్చుకోవడమే న్యాయవ్యవస్థకు దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలో నే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు గదులు, పరిపాలనా భవనాలు, ఆర్కైవ్స్, నివాస మౌలిక సదుపాయాలు, శిక్షణా కేంద్రాలన్నింటినీ సకల సౌకర్యాలతో ఒకే ప్రాంగణంలో నిర్మించేందుకు ప్రభుత్వం సంకల్పించటం అభినందనీయమన్నారు. న్యాయవ్యవస్థ తన సొంత నిబంధనల ప్రకారం, తన సొంత పరిధిలో పనిచేస్తుందని చెప్పారు. మనం సిద్ధాంతం నుంచి ఆచరణలోకి మారినప్పుడు సంస్థాగత స్వయం సమృద్ధి ఇలాగే ఉంటుందనీ, నేర్చుకోవడం మానేస్తే న్యాయవ్యవస్థ పరిణామం చెందడం కూడా ఆగిపోతుందని వివరించారు. హైకోర్టు ఆడిటోరియంలో జిల్లాల న్యాయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న సెంట్రల్ రికార్డ్ రూమ్ కూడా అంతే ముఖ్యమైనదనీ, భద్రపరిచిన, అందుబాటులో ఉన్న పూర్వ తీర్పులు, ఆ తర్వాత వచ్చే ప్రతి తీర్పునూ బలోపేతం చేస్తాయని చెప్పారు. దీనికి తగినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వటం హర్షణీయమంటూ ప్రభుత్వ ప్రణాళికను ప్రసంసించారు. సుస్థిర మౌలిక సదుపాయాలను మొదటి నుంచే డిజైన్‌లో పొందుపరిచారన్నారు. ఈ భవనం తరతరాల న్యాయమూర్తులకు, వ్యాజ్యదారులకు సేవలందించే ప్రాంగణం కాబట్టి ఈ భూమిని గౌరవించాలని సూచించారు. కొత్త భవనం కోసం వందెకరాలు కేటాయించడమేగాకుండా, ఈ ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే వందేండ్ల పాటు సేవలందించేలా రూపొందించిన ఈ కొత్త హైకోర్టు ప్రాంగణం రెండేండ్లలో పూర్తవుతుందని చెప్పారు. 2024లో శంకుస్థాపన చేసిన జోన్-1 పురోగతిపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, జోన్-2 కూడా మరో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, ఉజ్జల్ భూయాన్, ఎస్‌వీ భట్టి, అలోక్ అరధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల శాఖ సెక్రెటరీ వికాస్‌రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌జీ కర్ణన్, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఈ భవన నిర్మాణ డ్రాయింగ్‌లు, కోర్టు నమూనాలను సీజేఐ, సీఎం తదితరులు పరిశీలించారు. **ప్రార్థనా మందిరాలకంటే పవిత్రం : సీఎం రేవంత్‌రెడ్డి** కోర్టును నిర్మిస్తే ఒక పవిత్ర స్థలాన్ని నిర్మించినట్టే. గుడి, మసీదు, చర్చి కంటే ఎక్కువగా అన్ని మతాల వారందరికీ ఇది ఒక పవిత్రమైన ప్రదేశం. తన ప్రజా జీవితంలో ఈ శంకుస్థాపన సందర్భాన్ని ఒక అరుదైన, చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది.

# నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూకుంభకోణం

**హైదరాబాద్,ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్‌లోని నాదర్‌గుల్‌లో రూ.ఏడు వేల కోట్ల విలువైన భూకుంభకోణం జరిగిందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. అక్కడ సర్వేనెంబర్ 613 (కొత్త సర్వే నెంబర్ 119)లో ఉన్న 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని అన్నారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు, మంత్రులున్నారని ఆరోపించారు. అందుకే రక్షకులే భక్షకులుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములుగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు లేఖ రాస్తే నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ప్రభుత్వ భూములుగా అసెంబ్లీలో ప్రకటించి ఏపీఐఐసీకి అప్పగించారని గుర్తు చేశారు. కౌసల్య, మమత వంటి మహిళా రైతులు 40 ఏండ్లుగా ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్నారని వివరించారు. వారికి రూ.ఐదు లక్షలు, రూ.పది లక్షలు ఆశ చూపి వెళ్లగొట్టాలని చూస్తున్నారనీ, బోర్లు, కంచెలను ధ్వంసం చేశారని అన్నారు. నాదర్‌గుల్ భూములు శివరాజ్ బహదూర్‌వేనని ఆయన చెప్పినా 2005లోనే ఆర్డీవో ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారని చెప్పారు. 2017లో హైకోర్టు కూడా ఇది ప్రభుత్వ భూమి అంటూ చెప్పిందన్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక వ్యక్తికి 373 ఎకరాలుండే అవకాశం లేదనీ, అయినా 2016లో శివరాజ్ బహదూర్ ఆ భూములను ఆల్ఫా, ఒమేగా, యునిటెక్ కంపెనీలకు విక్రయించారని అన్నారు. చట్టంలోని సెక్షన్ ఎనిమిది, సెక్షన్ 17 ప్రకారం ల్యాండ్ సీలింగ్ డిక్లరేషన్ ఇవ్వకుండా భూములను అమ్మే హక్కు లేదన్నారు. ఆ విక్రయాలు చెల్లవనీ, ఇది సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటుందని కందుకూరు ఆర్డీవో తేల్చిచెప్పారని గుర్తు చేశారు. ఆర్డీవో నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆ కంపెనీలు హైకోర్టుకు వెళ్తే ఆర్డీవో నిర్ణయమే సరైనదనీ, ఆ భూముల క్రయవిక్రయాలు చెల్లవని సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ స్పష్టం చేశాయని వివరించారు. అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ వాళ్లు సుప్రీంకోర్టుకు వెళ్లారనీ, ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం వద్ద ఆ కేసు మంగళవారం విచారణకు రానుందని అన్నారు. భూభారతి పోర్టల్‌లో చూసినా అది ప్రభుత్వ భూమి ప్రొహిబిటెడ్ ల్యాండ్‌గానే చూపిస్తోందని వివరించారు. చెరువులను కాపాడుతున్నానని చెప్పే రేవంత్‌రెడ్డికి నాదర్‌గుల్ భూకబ్జాలు కనిపించడం లేదా?అని ప్రశ్నించారు. ఈ భారీ భూ కుంభకోణం, భూ కబ్జా కంపెనీల వెనుక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబమే ఉందని ఆరోపించారు. పేదల ఇండ్లు కూలగొట్టే 'హైడ్రా'కు అధికార పార్టీ నేతల కబ్జాలు, చెరువుల ఆక్రమణలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కబ్జాదారులను అరెస్ట్ చేసి, రైతులను భూముల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. నాదర్‌గుల్ భూములపై సోమవారం ఉదయం వరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకోకపోతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి అక్కడికి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ అన్నారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా రాహుల్ పేర్కొన్నారు. అసోంకు చెందిన సుప్రసిద్ధ గాయకుడు, కీర్తిశేషులు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ భావజాలం కూడా అలాంటిదేనని, ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే తమ సిద్ధాంతమని తెలిపారు. అస్సాంలో తాము అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో దోషులను 100 రోజుల్లోగా శిక్షిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక తరగతులకు షెడ్యూలు తెగ (ఎస్టీ) హోదా ఇస్తామని, తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు రాష్ట్ర ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంగా మార్చేశారని విమర్శించారు.

# భారత ఆర్థిక వృద్ధి రేటులో కోత

(మొదటి పేజీ తరువాయి)

ముడి సరుకుల వ్యయాల మధ్య ప్రయివేట్ వినియోగం క్షీణించడం, స్థూల స్థిర మూలధన నిర్మాణం బలహీనం కావడం భారతదేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం దృష్ట్యా 2026-27లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు గతంలో 6.8 స్థాయి నుండి తగ్గి 6శాతానికి పరిమితమవుతుందని అంచనావేస్తున్నాం" అని మూడీస్ నివేదిక తెలిపింది."ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నప్పటికీ.. భౌగోళిక, రాజకీయ ఇబ్బందులు ద్రవ్యోల్బణ అంచనాలను పెరుగుదల దిశగా మళ్లించాయి" అని మూడీస్ పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2.4శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2027లో సగటున 4.8శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ముప్పు తలెత్తడం, వృద్ధి బలంగా కొనసాగడంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో పాలసీ రేట్లు స్థిరంగా కొసాగవచ్చు లేదా క్రమంగా పెరగవచ్చు అని పేర్కొంది. పెరిగిన చమురు, గ్యాస్, ఎరువల ధరలు నిర్దేశిత సబ్సిడీపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తాయని, ఫలితంగా బడ్జెట్‌తో పోలిస్తే రాబడి క్షీణతతో పాటు అధిక వ్యయాలకు దారితీయవచ్చని పేర్కొంది.

# జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

జగన్‌కు లేదని అన్నారు. మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదని, కానీ జగన్‌ను చూస్తే ఆయనే గుర్తుకొస్తున్నారని చెప్పారు. మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారని పార్థసారథి విమర్శించారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణివల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. మరోవైపు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతిపైన, అమరావతిపైన జగన్‌కు ఎందుకంత కక్ష..? అని ప్రశ్నించారు. జగన్ మొదట అమరావతిని రాజధానిగా అంగీకరించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించామని ఆయన చెప్పారు. జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అన్నారు.

# నేడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్ళడం సంతోషకరమని అన్నారు. బిజెపి కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని జాతీయ సేవ, జాతీయత, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిబద్ధత అనే విలువలతో ముందుకు సాగే ఒక మహత్తర జాతీయ ఉద్యమం అని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త దేశం ముందు - పార్టీ తరువాత - స్వయం చివర అనే భావంతో, పార్టీ సిద్ధాంతాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఆయన తెలిపారు. నలభై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని నలభై ఆరు సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తమ పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలవడం మనందరికీ గర్వకారణం అని ఆయన వివరించారు. గతంలో జనసంఘ్‌గా ప్రారంభమైన ఈ ప్రయాణం, 1980లో ముంబైలో అటల్ బిహారీ వాజపేయి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీగా రూపుదిద్దుకుని, తన సిద్ధాంత బలం, క్రమశిక్షణ గల కార్యకర్తల శ్రమ, జాతీయ సేవ పట్ల అచంచల నిబద్ధతతో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని రాంచందర్ రావు వివరించారు. దేశంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చామని, అంతేకాక, రాబోయే కాలంలో కూడా మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నిర్ణయించుకున్నట్టుగా స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన తెలిపారు. అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రులైన తర్వాతనే భారత్ నిజమైన ఆర్థిక మార్పును, అభివృద్ధి యొక్క కొత్త యుగాన్ని చూడడం ప్రారంభించిందని ఆయన వివరించారు. వారిరువురి నాయకత్వం దేశానికి కొత్త దిశను చూపి, అభివృద్ధిని వేగవంతం చేసి, మరింత బలమైన, ఆత్మనిర్భరమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది వేసిందని రాంచందర్ రావు తెలిపారు.

# తెలంగాణ సక్సెస్‌ఫుల్ స్టార్టప్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని ఆయన వివరించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత దశాబ్ద కాలం పాటు జరిగిన అభివృద్ధి గురించి కెటిఆర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం ద్వారా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనం. తాము అవకాశాల కోసం ఎదురు చూడలేదు అని, వాటిని అందిపుచ్చుకునేందుకు అద్భుతమైన పాలసీలను తయారు చేశామని తెలిపారు.

# ఆప్ నేతలకు రాఘవ చద్దా కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తోసిపుచ్చారు. పార్లమెంట్‌లో తన ప్రసంగాలను తెలియచేస్తూ తాజాగా మూడు నిమిషాల వీడియోను వెలువరించారు. నిజానిజాలు ఈ దృశ్య శ్రవణ సాధనాలు తెలియచేస్తామని స్పందించారు. తనకు వ్యతిరేకంగా పార్టీలో తప్పుడు కథలతో ప్రచారానికి దిగుతున్నారని, దీనికి తాను ప్రతిస్పందన ఇచ్చుకోవల్సి ఉంటుందని తెలిపారు. రాజ్యసభలో ఆప్ ఉపనేత పదవి నుంచి ఇటీవల ఆయనను తొలిగించారు. ఇది వివాదాస్పదం అయింది. పంజాబ్ విషయాలను తాను ప్రస్తావించడం లేదని చెప్పడం కించపర్చడమే అని పేర్కొన్నారు. పంజాబ్ తనకు ఓ మైక్ అనుకోరాదని, అంతకు మించి ఓ ఇల్లు, తన ఆత్మ అని తెలిపిన రాఘవ పంజాబ్ కోసం స్పందించడం తన బాధ్యత అని తేల్చిచెప్పారు. రైతులకు కనీస మద్దతు ధరలు, భగత్ సింగ్‌కు భారత్ రత్న, భూగర్భ జలాల తగ్గుముఖం, నన్‌కానా సాహిబ్ కారిడార్ వంటి విషయాలపై మాట్లాడానని తెలిపారు. సంబంధిత వీడియోలు అందరి ముందుంచుతున్నాను మిత్రమా అని సవాలు విసిరారు. పంజాబ్ ఎమ్మెల్యేలు ఎన్నుకోవడం వల్లనే రాజ్యసభకు చద్దా వెళ్లారని, అయితే ఆయన పల్లెతు మాట కూడా పంజాబ్ కోసం మాట్లాడటం లేదని పంజాబ్‌లోని ఆప్ నాయకత్వం విమర్శిస్తోంది. ఆయన మౌనం దేనికి సంకేతం అని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, ఆప్ పంజాబ్ విభాగం అధ్యక్షులు అమన్ ఆరోరా , సీనియర్ నేత కుల్దీప్ సింగ్ ధాలీవాల్ చేస్తున్న విమర్శలకు ఇప్పుడు గౌరవప్రదంగానే రాఘవ కౌంటర్ ఇచ్చారు.

# చెన్నూరులో ఫెయిర్ ప్రైస్ షాప్‌పై సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## పారదర్శక పంపిణీపై దృష్టి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

**కల్లూరు, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో ఉన్న ఫెయిర్ ప్రైస్ షాప్‌ను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆకస్మికంగా సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. దుకాణంలో నిత్యావసర సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, రేషన్ కార్డు దారులకు అందుతున్న సేవలపై ఆయన సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, పప్పులు, చక్కెర వంటి అవసరమైన వస్తువులు అర్హులైన లబ్ధిదారులకు సమయానికి, సరైన నాణ్యతతో అందుతున్నాయా అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని సబ్ కలెక్టర్ స్పష్టంగా తెలియజేస్తూ, ఎటువంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దుకాణ నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. సరుకుల కొలతలు, రికార్డుల నిర్వహణ, స్టాక్



రిజిస్టర్‌లను సైతం ఆయన పరిశీలించారు. అక్కడికి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు




సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజంగా ప్రజలకు చేరేలా కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ తనిఖీతో స్థానిక ప్రజల్లో నమ్మకం పెరిగింది.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

### మహనీయుల ఆశయాలను తూ.చా. తప్పకుండా పాటించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు జిల్లా,ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం అని, మహనీయుల ఆశాలను నిరంతరం తూచా తప్పకుండా పాటించడమే వారికి మనమిచ్చే గొప్ప గౌరవమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.ఆదివారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి ఉత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సమతవాది, కార్మిక చట్టాల ఆద్యుడు గా దేశానికి







చేసిన సేవలను ఆయన చేసిన కృషిని కొనియాడారు.ఆయన ప్రస్థానం భావితరాలకు ఎంతో స్ఫూర్తి గా నిలుస్తుందని తెలిపారు. మహానుభావుల ఆశలను నిరంతరం చిత్తశుద్ధితో పాటిస్తూ వాటి అమలు కోసం కృషి కృషి చేయడం ద్వారానే వారికి నిజమైన కీర్తి ఘటించినట్టు అవుతుందన్నారు.భారతదేశ సామాజిక, రాజకీయ చరిత్రలో అలుపెరుగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తిగా,అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు. కేంద్ర కార్మిక మంత్రిగా అనేక కార్మిక సంక్షేమ విధానాలకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ములుగు మునిసిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పల చంద్రకళ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన కృషిని గుర్తు చేస్తూ వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, షెడ్యూల్ కులాల అధికారి కొమురయ్య, తాహసిల్దార్ విజయ భాస్కర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ములుగు జిల్లా, ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.ఆదివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆరోగ్య వారోత్సవాల నిర్వహణకు సంబంధించి సంబంధిత విభాగాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకొని వారం రోజులపాటు ఆరోగ్యానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 6 వ తేదీన న ఫుడ్ సేఫ్టీ ఆహార భద్రతపై దృష్టి పెట్టి ఆహార కల్తీ వల్ల వచ్చే జబ్బుల గురించి అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు "Eat Right Walk" నిర్వహించాలన్నారు. 7వ తేదీన న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించాలన్నారు. 8వ తేదీ న సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా వర్క్ షాప్ నిర్వహించాలని సూచించారు. 9వ తేదీ న ఎయిడ్స్ అవేర్నెస్ రెడ్ రన్ వాక్ నిర్వహించి అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు.10 వ తేదీ న హోమియోపతి అండ్ ఆయుష్ డే సందర్భంగా జిల్లా కేంద్రం లోని గిరిజన భవనంలో యోగా డిమానిస్ట్రేషన్ క్యాంపు నిర్వహించాలని పేర్కొన్నారు. 11వ తేదీన డ్రగ్ నియంత్రణ విభాగం ద్వారా ప్రజలకు మందుల వినియోగంపై అవగాహన, డ్రగ్ అబ్యూస్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాన్నారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించిన వివిధ అంశాలను వివిధ విభాగాల బాధ్యతలను



డిఎంహెచ్ఓ వివరించారు. వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆరోగ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డిఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, డి ఎస్ పి, డిపిఓ వెంకయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లి జ్ఞాపకార్థం సేవా సుగంధం

### బీరవల్లి బ్రదర్స్ చీరల పంపిణీ
### ప్రతి ఏటా 500 మందికి సహాయం
### సేవలోనే సంతృప్తి అంటున్న సోదరులు

**కల్లూరు, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మనిషి జీవితం ఎంతకాలం ఉన్నా, ఆయన చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయి. అలాంటి సేవా భావంతో ముందుకు సాగుతున్న బీరవల్లి బ్రదర్స్ మరోసారి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బీరవల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బీరవల్లి రఘు తమ మాతృమూర్తి బీరవల్లి పుల్లమ్మ జ్ఞాపకార్థం ఆదివారం యర్రబోయినపల్లి గ్రామంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తల్లి పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతల సమ్మిళితంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. సుమారు 13 ఏళ్ల క్రితం మరణించిన బీరవల్లి పుల్లమ్మ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతి ఏడాది సుమారు 500 మంది మహిళలకు చీరలు అందజేస్తూ గ్రామంలో సేవా కార్యక్రమాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి మనకు ఇచ్చిన ప్రేమను తిరిగి ఇవ్వలేము, కానీ ఆమె పేరును నిలబెట్టే విధంగా సమాజానికి సేవ చేయడం ద్వారా ఆమె ఆత్మకు శాంతి కలిగించాలని భావిస్తున్నాం అని తెలిపారు. భౌతికంగా దూరమైనప్పటికీ, తల్లిని ఆత్మీయంగా మరువకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్తులు, మహిళలు బీరవల్లి బ్రదర్స్ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ, వారు ఎప్పుడూ ప్రజల కష్టాల్లో ముందుంటారని గుర్తు చేసుకున్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండి సహాయం చేయడం వారి ప్రత్యేకత అని చెప్పారు. ఇలాంటి సేవా గుణం కలిగిన వ్యక్తులు సమాజానికి ఆదర్శమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఏడి ఈ స్టోర్ మేనేజర్ తంబాల కిరణ్ కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బీరవల్లి వెంకట నారాయణ, షాతులూరి ఐజక్, మేక శ్రీరాములు, మేక భద్రాచలం, తాళ్ల నరసింహారావు, బీరవల్లి కృష్ణయ్య, బీరవల్లి మోహన్ రావు, బీరవల్లి నారాయణ, కటుకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.చివరగా గ్రామ ప్రజలు బీరవల్లి బ్రదర్స్‌కు ఆశీర్వాదాలు అందిస్తూ, వారు ఇలాగే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజంలో సేవాస్ఫూర్తి పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



# సత్తుపల్లి డిపోలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు







**సత్తుపల్లి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) సత్తుపల్లి డిపోలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని అన్నారు. భారతదేశానికి తొలి ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జగన్నాథం, వెంకటయ్య, బసవయ్య, బాలస్వామి, టీ ఐ త్రీ జాకబ్, ఏడీసీలు కిరణ్ బాబు, కాంతారావు, సత్యం వీరితోపాటు గ్యారేజీ సిబ్బంది అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# అక్రమ గ్రావెల్ రవాణాపై సబ్ కలెక్టర్ కఠిన చర్యలు

● రెండు టిప్పర్ లారీలు స్వాధీనం






**కల్లూరు, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మండల పరిధిలో అక్రమంగా గ్రావెల్ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఉత్తర్వులతో ప్రత్యేక బృందం అప్రమత్తమైంది. మార్చి 3వ తేదీన రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన బృందం, అనుమతి లేకుండా గ్రావెల్ రవాణా చేస్తున్న రెండు టిప్పర్ లారీలను గుర్తించి అడ్డుకుంది. పట్టుబడిన వాహనాల్లో AP39VG2239 యజమాని, డ్రైవర్ చెలపూడి చిన్న వెంకటేశ్వర్లు మరియు TS04UH3084 యజమాని, డ్రైవర్ మానేపల్లి గోపీకృష్ణ ఉన్నాయి. ఈ రెండు వాహనాలు కల్లూరు గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా ప్రత్యేక బృందం వాటిని స్వాధీనం చేసుకొని అదే రోజు కల్లూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించింది. ప్రస్తుతం వాహనాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచి, ఘటనపై తదుపరి చర్యలు కొనసాగిస్తున్నారు.ఈ తనిఖీల్లో బి మహేశ్వరరావు చంద్రుపట్ల, సందీప్ పాయపూర్, అంజనేయులు లోకవరం, నరసింహారావు లక్ష్మీపురం, నాగరాజు పెరువంచ వంటి జీపీఓలు పాల్గొన్నారు. ప్రత్యేక బృందం సమయోచిత చర్యతో అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషించింది. అక్రమ ఇసుక, మట్టి, గ్రావెల్ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన పక్షంలో వెంటనే సబ్ కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నియమాలను కచ్చితంగా పాటిస్తూ సహజ వనరుల సంరక్షణకు అందరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వాగులో గుడుంబా తయారీ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం










**ములుగు జిల్లా,ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో అక్రమ గుడుంబా తయారీకి కొత్త రూపం దాల్చింది. వాగు మధ్యలో గుంతలు తవ్వి, ఎవరికి అనుమానం రాకుండా రహస్యంగా గుడుంబా తయారు చేస్తున్నట్టు గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.**వాగులోనే తయారీ గుర్తించలేని కొత్త పద్ధతి** గ్రామస్తుల సమాచారం మేరకు, వాగులో నీటి మధ్య గుంతలు తవ్వి వాటిలోనే గుడుంబా తయారీ జరుగుతోంది. బయటకు ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా ఈ ప్రక్రియ కొనసాగుతున్నందున, అధికారులకు గుర్తించడం కష్టమవుతోందని స్థానికులు చెబుతున్నారు.**ఇటుక వ్యాపారం పేరుతో అక్రమాలు** పక్కనే ఉన్న ఇటుక ప్లాంట్‌ను కవర్‌గా ఉపయోగిస్తూ, పేరుకు వ్యాపారం నిర్వహిస్తున్నట్లు చూపించి లోపల గుడుంబా తయారీ కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ అక్రమ కార్యకలాపాలు మరింత గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు.**ఎక్సైజ్ శాఖపై నిర్లక్ష్య ఆరోపణలు** ఈ విషయం పై పలుమార్లు ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.**యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం** ఈ అక్రమ గుడుంబా వల్ల యువత ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషపూరిత మద్యం సేవించడం వల్ల 25 ఏళ్లకే ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు జరుగుతున్నాయని, కొందరికి కళ్ల సమస్యలు కూడా వస్తున్నాయని తెలిపారు.**తక్షణ చర్యలు తీసుకోవాలి గ్రామస్తుల డిమాండ్**ఈ ఘటనపై వెంటనే దర్యాప్తు చేసి, అక్రమ గుడుంబా తయారీని అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**కల్లూరు, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సామాజిక న్యాయ దీప్తి భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు సమర్పించారు. దేశానికి చేసిన సేవలు, ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఆయన ఆలోచనలను అనుసరిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## నేడు ప్రజావాణి - గిరివాణి కార్యక్రమం ఐటీడీఏ ఏటూరునాగారంలో ...: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ములుగు జిల్లా,ఏప్రిల్05(పీసీడబ్ల్యూ న్యూస్):** సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రత్యేకంగా 6న సోమవారం ఏటూరునాగారంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ అర్జీలను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ములుగు జిల్లాలో మెడికల్ షాపుల దందా బహిర్గతం

**అర్హతలేని వ్యక్తులతో మందుల విక్రయం**

**ప్రజల ప్రాణాలతో చెలగాటం**

**డ్రగ్ ఇన్స్పెక్టర్ల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం**



**ములుగు,ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా ఏటూరునాగారం మండలం, వాజేడు ప్రాంతాల్లో కొత్తగా వెలిసిన మెడికల్ షాపుల్లో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హతలేని వ్యక్తులు ఫార్మసిస్టుల పేరుతో మందులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిస్థితి నెలకొంది. **అర్హతలేని వ్యక్తులతో షాపుల నిర్వహణ** మెడికల్ షాపుల్లో తప్పనిసరిగా రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ఉండాలి. కానీ ములుగు జిల్లాలో అనేక చోట్ల ఫార్మసిస్టులు లేకుండానే షాపులు నడుస్తున్నాయి. ఎటువంటి వైద్య పరిజ్ఞానం లేని వ్యక్తులు మందులు ఇవ్వడం వల్ల రోగులకు ప్రమాదం పెరుగుతోంది. **సర్టిఫికెట్ల అద్దె దందా బహిరంగం** కొంతమంది ఫార్మసిస్టులు తమ సర్టిఫికెట్లను ఇతరులకు అద్దెకు ఇస్తూ, షాపులో హాజరు కాకుండా వేరే పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ విధంగా బినామీ పేర్లతో మెడికల్ షాపులు నిర్వహించడం విస్తృతంగా జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి.

# సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన బాబూ జగ్జీవన్ రామ్...

**- దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించిన నాయకుడు.**

**- చనిపోయేదాకా ఎంపీగా కొనసాగిన నేత.**

**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.**

**- బాబూ జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి.**

**- కరీంనగర్ మేయర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన బండి సంజయ్.**





**కరీంనగర్,ఏప్రిల్05(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత రాజకీయ చరిత్రలో సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు, దళిత జాతి రత్నం బాబూ జగ్జీవన్ రామ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా కొనసాగిన బాబూ జగ్జీవన్ రామ్ దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించి చూపారని తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఉదయం కరీంనగర్ లోని మంచిర్యాల చౌరస్తా వద్దనున్న ఆయన విగ్రహానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతోపాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు."చిన్నప్పటి నుండి కుల వివక్షను ఎదుర్కొని పోరాడిన నాయకుడు జగ్జీవన్ రాం. అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని చివరిదాకా అంకితం చేసిన నాయకుడు. 1.కష్టాలను జయించి ఎదగాలి. 2.సమాజంలోని బలహీన వర్గాల కోసం నిలబడాలి. 3.దేశ సేవే మన పరమ ధర్మం అనే మూడు నినాదాలను పుణికి పుచ్చుకుని జీవితాంతం వాటి కోసం పాటుపడిన నాయకుడు జగ్జీవన్ రామ్" అని పేర్కొన్నారు.స్వతంత్ర భారతదేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1952 నుంచి ఆయన చనిపోయే 1986 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన జగ్జీవన్ రామ్ కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు.దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ గాంధీ వెన్నంటి నడిచిన జగ్జీవన్ రామ్ భారత రాజకీయ, సామాజిక రంగాల్లో అజాతశత్రువుగా నిలిచారని తెలిపారు. జగ్జీవన్‌రామ్ అనుసరించిన ఆదర్శాలు.. చూపిన సంస్కరణ మార్గాలనూ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. **-మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభం.** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని



తీగలగుట్టపల్లిలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఏర్పాటు చేసిన మేయర్ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు. క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావుతోపాటు బీజేపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.

# జాతీయ భద్రత, దేశహితం,భరతమాత సేవ కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి

**- బిజెపి కుటుంబ సభ్యులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు...**

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర...**

**కరీంనగర్,ఏప్రిల్05(పీసీడబ్ల్యూన్యూస్):** జాతీయ భద్రత, దేశ హితం, భరతమాత సేవ కోసం దేశంలో పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. ఏప్రిల్ 6 న 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పార్టీ పిలుపు మేరకు ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం రోజున బిజెపి జిల్లా అధికార ప్రతినిధి "బొంతల కళ్యాణ్ చంద్ర" అలుగునూర్ (శ్రీ వెంకటేశ్వర కాలనీ)లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 న అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఆవిర్భవించిందన్నారు. వరల్డ్ లార్జెస్ట్ పార్టీ గా బిజెపి అవతరించడానికి ప్రధాన కారణం పార్టీ సిద్ధాంతమేనన్నారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదమే బీజేపీ నీ తిరుగులేని శక్తిగా మార్చిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం నేడు దేశాన్ని ఏలే స్థితికి వచ్చి, వరుసగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు బిజెపి పట్ల దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని విశ్వసాన్ని వమ్ము చేయకుండా ముందు కొనసాగుతుందన్నారు. బిజెపి బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ శ్రేణుల శ్రమ కూడా మరువలేనిదన్నారు. ముఖ్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతకు, దేశ అభివృద్ధి కోసం పెద్ద పీట వేసి ముందు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా దేశ సమస్యలను గుర్తించడం భవిష్యత్ లో వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు పరస్పర యుద్ధాలతో విచ్ఛిన్నమవుతున్నాయని, భారతదేశం మాత్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ విశ్వ గురువు దిశలో ముందుకు దూసుకుపోతుందన్నారు. మేకిన్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భరభారత్ బలోపేతమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రధానంగామోడీ 2014లో వచ్చాక దేశంలో ప్రతీ రంగంలోనూ శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకు కొనసాగుతున్నారని తెలిపారు. దేశానికి, రాష్ట్రాలకుబిజెపి ప్రభుత్వాలే శ్రీరామరక్ష అని ఆయన ఈ సందర్భంగా అన్నారు.



# తిరు హృదయ దేవాలయంలో క్రీస్తు పునరుద్ధాన పండుగ వేడుకలు

**రెవ" ఫాదర్ కృప చారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు**

**వేడుకలకు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు**

**విశిష్ట అతిథిగా కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ హాజరు**





**సత్తుపల్లి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏసుక్రీస్తు ప్రభువు మనుషుల అన్యాయపు తీర్పుకు సిలువపై మరణం పొంది, మూడు రోజుల తర్వాత మరల సమాధి నుండి సజీవంతో లేచాడు అనే బైబిల్ వాక్యం అనుసరించి ప్రపంచ క్రైస్తవులు నిర్వహించే అతిపెద్ద పండుగ క్రీస్తు పునరుద్ధాన పండుగ (ఈస్టర్). ఈ పండుగ వేడుకలను మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీ తిరు హృదయ దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను విచారణ గురువులు రెవ"ఫాదర్ కృపాచారి ప్రత్యేక ప్రార్థనలతో ఆధ్యాత్మికంగా నడిపించారు. ఈ వేడుకలో సంఘంలోని యువతి యువకులు క్రైస్తవ భక్తి గీతాలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, ఉప సర్పంచ్ శీలం నాగరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చారిత్రక ఆధారాలతో క్రీస్తు మరణించి తిరిగి లేచాడనే విశ్వాసంతో గ్రామ ప్రజలు ఈస్టర్ పండుగ వైభవంగా నిర్వహించడం శుభసాంప్రదాయమని అన్నారు. ఈ వేడుకకు విశిష్ట అతిథిగా పాల్గొన్న కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ తిరు హృదయ దేవాలయ నిర్మాణం అత్యంత వైభవంగా ఉందని, ఆలయాన్ని మరింత ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడానికి సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ తో చర్చించి సంస్థ తరపున నిధుల మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. వేడుకకు హాజరైన అతిథులను సంఘస్తులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం సంఘస్థులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపదేశి శ్రీనివాసరావు, కిష్టారం సింగరేణి ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణ, క్వాలిటీ ఇంచార్జ్ అవినాష్, సంఘ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి వెంకటేశ్వరరావు, మారోజు శ్రీను, వాడపల్లి కోటేశ్వరరావు, పాగా పాపయ్య, రామాల రాములు, పాలకుర్తి ప్రవీణ్, పాలకుర్తి పుల్లయ్య, తాళ్ల నాగేంద్ర, రామాల వెంకటేష్, పాలకుర్తి జగన్, పాలకుర్తి కాంతయ్య, రామాల బాలరాణి, పాలకుర్తి జయంత్, వడ్డేపల్లి అరుణ అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

## బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మానం...



**కరీంనగర్,ఏప్రిల్05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లో బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రోజున కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా బేడ బుడగ జంగం కులం నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించిన భూపతి రవీందర్ ని వేదికపై ఘనంగా సత్కరించారు. ఆయన సాధించిన విజయం బేడ బుడగ జంగం సమాజానికి గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సమాజం రాజకీయంగా మరింత ముందుకు రావడానికి ఇలాంటి నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు విచ్చేసి అభినందనలు తెలియజేసి, బేడ బుడగ జంగం సమాజం సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలనే ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షులు ఆల్ ఇండియా బేడ బుడగ జంగం కాన్ఫెడరేషన్ డాక్టర్ ఎన్ఆర్ వెంకటేశం మాట్లాడుతూ సమాజ ఐక్యత, రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కడమంచి సహదేవుడు (రాష్ట్ర అధ్యక్షులు బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి), సిరిపాటి వేణు (రాష్ట్ర అధ్యక్షులు బేడ బుడగ జంగం జన సంఘం), మోటం రామ్ కుమార్ (బేడ బుడగ జంగం నాయకులు) ప్రోగ్రాం ఆర్గనైజర్ కళ్యాణం శరత్ చంద్ర, బేడ బుడగ జంగం మేధావుల ఫోరం నాయకులు, డాక్టర్ కళ్ళెం ఆంజనేయులు, రిటైర్డ్ టీచర్ నరసింహ లతోపాటు బేడ బుడగ జంగం జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, స్థానిక నాయకులు,యువజన నాయకులు సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** దివంగత మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి 119వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరం బైపాస్ రోడ్‌లోని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహానికి ఖమ్మం జిల్లా డీసీపీ శ్రీ బొజ్జ రామానుజం గారు, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళితరత్న గారు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన వారు, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మహానుభావుడని పేర్కొన్నారు. ఉప ప్రధానిగా, న్యాయశాఖ మంత్రిగా, కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ దళిత, బహుజన మరియు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఆయన సేవలు దేశానికి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను దళిత బహుజన వర్గాలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పడిశాల వెంకన్న, టీఎంహెచ్‌డీ నగర అధ్యక్షుడు కుక్కల రామకృష్ణ (ఆర్కే), నగర కార్యదర్శి పైడిముక్కల విజయ్, జంగం నగేష్ కుమార్, కాంపాటి ఉపేందర్, కాంపాటి సాయి, కొండపల్లి మధు, కురసం సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భట్రాజు సంఘం అభివృద్ధికై పాటుపడతా: మోహన్ రాజు

● మెదక్ జిల్లా భట్రాజు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**మెదక్ ఏప్రిల్ 05(పి సి డబ్ల్యూ న్యూస్):** భట్రాజు సంఘం అభివృద్ధికై పాటుపడతానని మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మోహన్ రాజు అన్నారు. మెదక్ జిల్లా భట్రాజు సంఘం ఎన్నికలు భట్రాజు నగర్ కాలనీలో ఏకగ్రీవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులుగా ప్రతికంఠం మోహన్ రాజు,గౌరవ అధ్యక్షులు గా నందినట్టు సుధాకర్ రాజు , ప్రధాన కార్యదర్శి గా బట్టు వెంకట నరసింహ రాజు,కోశాధికారిగా ప్రతి కంఠం పూర్ణచందర్ రాజు, ఉపాధ్యక్షులు గా బట్టు రాజ్ కుమార్, బట్టు రామరాజుకార్యదర్శులు గా బట్టు పృథ్వీరాజు, కేశవరాజు మోహన్ రాజు, ప్రచార కార్యదర్శి గా ప్రతి కఠం వికాస్ రాజు,కార్యవర్గ సభ్యులు గా బట్టు రాజు సంతోష్ రాజు, ప్రతి కంఠం శ్రీధర్ రాజు, లక్ష్మణ్ రాజు,విద్యాకరాజు, గౌరవ సలహాదారులు గా బట్టు వెంకటరాజు, బట్టు చంద్రశేఖర్ రాజు, సుదర్శన్ రాజు, ప్రతి కంఠం నాగరాజును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సింగభట్టు రామరాజు, పర్యవేక్షకులు ఎర్రమరాజు సాయి కృష్ణ, సహాయ ఎన్నికల అధికారి ఎర్రమరాజు భాను చందర్ రాజు సమక్షంలో సజావుగా నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయించారు.నూతన కార్యవర్గానికి పదవీ బాధ్యతలను అప్పగించారు.



## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

### ఆయన ఆశయాలే మార్గదర్శకం

### మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్





**కల్లూరు, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలోను, ప్రధాన సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద భారత తొలి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు అపారమని, ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ చిరస్మరణీయమని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన జీవితాంతం కృషి చేసిన మహానేతగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉండాలని, సమాజంలో సమాన హక్కులు అందరికీ లభించేలా మనం పనిచేయాలని పిలుపునిచ్చారు. బాబు జగ్జీవన్ రామ్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని, అనంతరం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. కార్మిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి విశేషం. ముఖ్యంగా అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడుతూ, సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు కృషి చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదిగా నిలిచింది.కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు మరియు శాంతి నగర్ వాసులు పాల్గొని పుష్పమాలలతో ఘనంగా నివాళు లర్పించారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజ సేవకు అంకితమవుదామని ప్రతిజ్ఞ చేశారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఖమ్మంపాటి వీరస్వామి ప్రధాన సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బాబు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు , కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, గుండ్ల పుల్లారావు, దాసరి సుధారాణి, భూక్య రాంబాయి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పెద్దబోయన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఏనుగు సత్యంబాబు, మాజీ వార్డు సభ్యులు బైర్ల కాంతారావు, నాయకులు శ్రీలం కృష్ణారెడ్డి, ఖమ్మంపాటి వీరస్వామి, యాస శ్రీకాంత్, కిష్టం చెట్టి కొండల్, పరిగడుపు రాము, నోటి కృష్ణారెడ్డి, జిల్లా యువజన నాయకులు ధరావత్ రవికుమార్, ఖమ్మంపాటి వెంకటేశ్వర్లు, రావూరి సీతారాములు, కె పుల్లాచారి, గద్దల వెంకటేశ్వర్లు మున్సిపాలిటీ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.



## దళితుల బ్రతుకులలో మార్పు తెచ్చిన జాతి మెచ్చిన నేత బాబు జగ్జీవన్ రామ్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఎస్.సి.సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం హాజరై కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ రెడ్డి తో పాటు పలువురు నాయకులతో కలిసి జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం నగరంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే, జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం, కేంద్రమంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించినారు.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు పూజ్య బాబు జగ్జీవన్ రామ్ దళిత సామాజిక కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి ఉన్నత చదువులు అభ్యసించి ఈ దేశంలో దాదాపు 30సంవత్సరాల పాటు కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసి ఆ సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, ఈ దేశానికి ఎన్నో సేవలు చేసినారు, వారి తరువాత వారి కుమార్తె మీరా కుమార్, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా లోక్ సభ స్పీకర్ గా ఉండి 60సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహనీయురాలు, సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్ రామ్ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలు, కార్యక్రమాలు నేటికీ పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని వారు చేసిన సేవలను స్మరించుకుంటూ మరోసారి ఘన నివాళులు అర్పిస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఊట్కూరు నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఎండి తాజ్,మడుపు మోహన్, పులి ఆంజనేయులు గౌడ్, మల్లికార్జున రాజేందర్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బానోతు శ్రావణ్ నాయక్, ఎక్కురమ్ సికిందర్, వెన్నం రజిత రెడ్డి, పర్వత మల్లేశం, వరాల నరసింగం, వెల్కపల్లి లచ్చయ్య,కామ్ రెడ్డి రామ్ రెడ్డి, వంగల విద్యాసాగర్,జీడి రమేష్,సలీముద్దీన్, మాదాసు శ్రీనివాస్, నెల్లి నరేష్, స్వప్నశ్రీ, ఊకంటి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ సాధకుడు బాబు జగ్జీవన్ రామ్




### - గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సునీత

### - బాబూజీ జయంతి సందర్భంగా గురుకుల కళాశాలలో సమతా సందేశం


**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజిక న్యాయ సాధకుడు బాబు జగ్జీవన్ రామ్ అని, సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సునీత అన్నారు. ఖమ్మంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో భారత మాజీ ఉప ప్రధానమంత్రి, మహనీయ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు బాబు జగ్జీవన్ రామ్ (బాబూజీ) జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థినుల ఉత్సాహం, అధ్యాపకుల ప్రేరణతో కళాశాల ప్రాంగణం ఆత్మీయతతో నిండిపోయింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ... బాబూజీ 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని భోజ్‌పూర్ జిల్లాలో జన్మించి, అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడని గుర్తు చేశారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. కేంద్ర మంత్రిగా రక్షణ, వ్యవసాయం, కార్మిక రంగాలలో ఆయన చేసిన సేవలు విశేషమని, ఉప ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధికి కీలకంగా పనిచేశారని కొనియాడారు. అందుకే ఆయన జయంతిని "సమతా దివస్"గా జరుపుకోవడం ఎంతో అర్థవంతమని పేర్కొన్నారు.ఈ వేడుకలో పాల్గొన్న విద్యార్థినులు బాబూజీ జీవితం, ఆయన విలువలపై ప్రేరణ పొందుతూ, సమాజంలో సమానత్వం, న్యాయంకోసం కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. గురుకుల విద్యార్థినుల కళ్లలో మెరుస్తున్న ఆశయాలు, వారి మాటల్లో వినిపించిన స్ఫూర్తి కార్యక్రమాన్ని మరింత భావోద్వేగభరితంగా మార్చింది.అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి బాబూజీకి నివాళులర్పిస్తూ, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం కేవలం జయంతి వేడుకగా మాత్రమే కాకుండా, మానవీయ విలువలను గుర్తుచేసే ప్రేరణాత్మక వేడుకగా నిలిచింది.

# జాగ్రత్త..! పెరుగుతున్న కోతులు, కుక్కల దాడులు

**వేసవి ఎండలతో మూగజీవాల దూకుడు**
**అప్రమత్తంగా ఉండాలని నిపుణుల హెచ్చరిక**

**ములుగు జిల్లా,ఏప్రిల్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో కోతులు, వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. వేసవి తీవ్రత పెరగడంతో మూగజీవాల ప్రవర్తనలో మార్పులు వచ్చి, ప్రజలపై దాడులకు దిగుతున్న ఘటనలు అధికమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎండల ప్రభావంతో మారుతున్న ప్రవర్తనభానుడి భగభగలతో మనుషులే కాదు, జంతువులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోతులు, కుక్కలు అసహనంగా మారి, తమకు ప్రమాదమని భావించిన వారిపై దాడి చేస్తున్నాయి.దాడులకు ప్రధాన కారణాలు అధిక ఉష్ణోగ్రతలు & చికాకుఎండల వల్ల జంతువుల్లో అసహనం పెరిగి, చిన్న చిన్న ఉద్రిక్తతలకే దాడులు చేస్తున్నారు.నిర్జలీకరణ నీటి కొరత కారణంగా జంతువులు ఆగ్రహంగా మారుతున్నాయి. మాతృత్వ రక్షణఈ కాలంలో కుక్కలు పిల్లలకు జన్మనిస్తాయి. వాటిని కాపాడే క్రమంలో ఎవరైనా దగ్గరకు వస్తే ప్రమాదంగా భావించి దాడి చేస్తున్నాయి.ప్రజలకు హెచ్చరికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కుక్కలు, కోతులు గుంపులుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలి చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదు ఇంటి బయట నీటి కుండలు ఉంచి జంతువులకు నీటి సౌకర్యం కల్పించాలి జంతువులను రాళ్లతో కొట్టడం, కర్రలతో బెదిరించడం చేయకూడదుకరచినపుడు చేయాల్సినవిఒకవేళ కుక్క లేదా కోతి కరిస్తే:వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలిఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలియాంటీ-రేబిస్ టీకా తప్పనిసరిగా తీసుకోవాలిఅధికారుల చర్యలు అవసరంప్రజలు భయాందోళనలో ఉన్న నేపథ్యంలో, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకుని:వీధి కుక్కల నియంత్రణకోతుల నియంత్రణ చర్యలుప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు సారాంశంవేసవి కాలంలో మూగజీవాల ప్రవర్తనలో మార్పులు సహజమే అయినప్పటికీ, ప్రజలు





అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. అప్రమత్తతే ప్రాణరక్షణకు మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

# మహనీయుల ఆశలను తూ.చా. తప్పకుండా పాటించాలి: పి.కృష్ణయ్య

- **బాబు జగ్జీవన్ రావ్ సేవలు చిరస్మరణీయం**
- **అతి చిన్న వయసులోనే కేంద్రమంత్రి గా పదవీ బాధ్యతలు**
- **భావితరాలకు ఎంతో స్ఫూర్తి**



**ఉప్పల్ ఏప్రిల్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ బాబు జగ్జీవన్ రావు119 జయంతి ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అని మహనీయుల ఆశలను నిరంతరం తూచా తప్పకుండా పాటించడమే వారికి మనమిచ్చే గొప్ప గౌరవమని హైకోర్టు న్యాయవాది పి. కృష్ణయ్య అన్నారు. రామంతపూర్ మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రావు భారతదేశ సామాజిక రాజకీయ చరిత్రలో అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తిగా అతి చిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ అధికార ప్రతినిధి ఇల్లిటం నరసింహారెడ్డి, రామంతపూర్ డివిజన్ యువ మోర్చా అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, అంజయ్య పటేల్, పూల ప్రభాకర్, ఇతరులు పాల్గొన్నారు.

# హితేక్ష అన్నప్రాసన వేడుకలో గ్రామీణ వైద్యుల ఐక్యత

**- తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘ రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హితేక్ష అన్నప్రాసన వేడుకగ్రామీణ వైద్యుల మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం, ఐక్యతను ప్రతిబింబించిందని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘ రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్, జిల్లా అధ్యక్షులు మద్రి నరేష్ లు అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని పెద్దబీరెల్లి గ్రామంలో ఆదివారం ఆనందభరిత వాతావరణంలో చిన్నారి హితేక్ష అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామీణ వైద్యుడిగా సేవలందిస్తున్న గుర్రం సురేష్ కుమార్తెకు జరిగిన ఈ శుభకార్యానికి కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు గ్రామీణ వైద్యుల సమాజం పెద్ద ఎత్తున హాజరై ఆశీస్సులు అందించారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘ రాష్ట్ర



అధ్యక్షులు దాసరి నరేష్, జిల్లా అధ్యక్షులు మద్రి నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకటి కరుణాకర్, మండల కార్యవర్గ సభ్యులు వై డేవిడ్, ఇతర సంఘ సభ్యులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమం కేవలం కుటుంబ వేడుకగానే కాకుండా, గ్రామీణ వైద్యుల మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం, ఐక్యతను ప్రతిబింబించింది. ప్రతిరోజూ ప్రజల




ఆరోగ్యానికి అంకితభావంతో పనిచేసే వైద్యులు, ఈ విధంగా ఒకరి ఆనందాన్ని మరొకరు పంచుకోవడం ఎంతో అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. చిన్నారి హితేక్ష ఆరోగ్యంగా, ఆనందంగా ఎదిగి భవిష్య త్తులో మంచి స్థాయికి చేరుకోవాలని హాజరైన అతిథు లు ఆకాంక్షించారు. గ్రామంలో సంతోషకర వాతావ రణంనెలకొని,అందరి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

# హైదరాబాద్‌లో ఘనంగా MESA జనరల్ బాడీ సమావేశం,ఈద్ మిలన్ కార్యక్రమం...











**హైదరాబాద్, ఏప్రిల్05(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సెంట్రల్ యూనియన్ ఆధ్వర్యంలో స్టేట్ జనరల్ బాడీ సమావేశం మరియు ఈద్ మిలన్ కార్యక్రమం హైదరాబాద్‌లోని సర్వారం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మరియు వ్యవస్థాపకుడు డా. మహ్మద్ అబ్దుల్ ఫారూక్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ నైమొద్దీన్, అధ్యక్షుడు ఖ్వాజా మోయినుద్దీన్, ప్రెస్ కార్యదర్శి సయ్యద్ అహ్మద్ బుఖారీ, జాతీయ సమన్వయకర్తలు తౌఫీక్ రెహమాన్, అబ్దుల్ రబ్ నేతృత్వంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. రియాజ్ అహ్మద్, ప్రధాన అతిథి ఎల్లోరు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మైనారిటీ ఉద్యోగులు ఒకే వేదికపై ఐక్యంగా ఉండాలని, ఐక్యత ద్వారానే వారి సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ఇదే కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా వీజువా క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ ముహియుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనరల్ సెక్రటరీ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ హాఫీజ్‌ఓద్దిన్, స్టేట్ సెక్రటరీ అబ్దుల్ జమీల్, హబీబ్ రెహమాన్ తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని అఫ్జల్ ముహియుద్దీన్ సమర్థవంతంగా నిర్వహించారు. ఈద్ మిలన్ వేడుకలు కూడా నిర్వహించడంతో కార్యక్రమంలో సౌహార్దం, సోదరభావం, ఐక్యత వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. సభ్యులందరు భారీ సంఖ్యలో పాల్గొని తన ఐక్యతను చూపించారు.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి..



**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని, ఆ మహనీయుని స్ఫూర్తితోనే మన ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఆదివారం భారత మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఖమ్మం నగరంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ, జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.దేశ ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంలో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు ఈనాటికీ పాలకులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. రక్షణ శాఖ మంత్రిగా గాని, ఇతర ఏ శాఖ బాధ్యతలు చేపట్టినా, ఆ శాఖకు సరికొత్త ఔన్నత్యాన్ని తీసుకువచ్చిన గొప్ప పరిపాలనాదక్షుడు ఆయనని డిప్యూటీ సీఎం ప్రశంసించారు.సామాజిక మార్పు కోసం అవిరళ కృషి, దేశంలో సామాజిక సమానత్వం, మార్పు కోసం జగ్జీవన్ రామ్ అనేక పోరాటాలు చేశారని, దేశ భవిష్యత్తుకు ఆయనో దిక్సూచిలా నిలిచారని డిప్యూటీ సీఎం తెలిపారు. అత్యంత పేదరికం, వెనుకబాటుతనం నుంచి వచ్చినప్పటికీ, తన కృషితో



దేశంలోనే అత్యున్నత స్థానాలకు ఎదిగారని, అధికారాన్ని అనుభవించడానికి కాకుండా, దేశ ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని ధారపోశారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.రాజకీయాల్లోకి వచ్చే ప్రతి ఒక్కరికీ బాబు జగ్జీవన్ రామ్ జీవితం ఒక పాఠమని, ఆయనది నిరంతరం ప్రగతిశీలమైన పంథా అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రాం జీవితం ద్వారా చెప్పడం కంటే, చేతల ద్వారానే సందేశం ఇచ్చారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. పార్లమెంటేరియన్ గా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతి గా విశిష్ట సేవలు అందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, ఆయన ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా పని చేయాలని, ప్రభుత్వ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు.అనంతరం అంబెద్కర్ భవన్ లో జరిగిన డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొని, డా. బాబు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. వారు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని, తెచ్చిన సంస్కరణలను గుర్తు చేశారు. వారు చూపిన మార్గంలో నడిచి, వారి ఆశయ సాధన కు కృషిచేయడమే, వారికిచ్చే నివాళి అని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాసు నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎస్సి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. జ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్లు కామా ప్రభాకర్, మారేపల్లి వెంకట నారాయణ, అధ్యక్షులు పేర్ల మధు, సంతేటి వీరభద్రం, గౌరవ అధ్యక్షులు జమ్మి వీరబాయి, పడిశాల వెంకన్న, లింగాల రవికుమార్, బచ్చలికూర వెంకటేశ్వర్లు, దాస్ మహరాజ్, తూరుగంటి రాజయ్య, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీ మేసా ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు కట్టా శేఖర్, షేక్ రంజాన్, వెంకటరమణ, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# పరామర్శిస్తే కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తారా?: మొర్రిరాజుయాదవ్....




**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూన్యూస్):** మేడారం పూజారి సిద్ధ బోయిన రమేష్ కుటుంబాన్ని మానవత్వ దృక్పథంతో పరామర్శించి మనో ధైర్యాన్ని ఇచ్చిన దీ=ా జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం చాలా దురదృష్టకరం అని బిఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజుయాదవ్ అన్నారు. పార్టీలకు అతీతంగా ఎవరు కష్టాల్లో ఉన్న తోడుగా నేనున్నానంటూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తాన్ని అందించే మంచి మనసున్న నాయకుడు లక్ష్మణ్ బాబుగారు అలాంటి వారిపై రాజకీయ కక్షతో విమర్శలు చేయడం చాలా బాధాకరం. మేడారం పూజారి రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి పరామర్శించిన లక్ష్మణ్ బాబు గారిపై విమర్శలు చేయడం సరిఅయిన విధానంకాదు అని ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే రమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. జాతర సందర్భంలో అది చేస్తున్నాం ఇది చేస్తున్నామని ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ నాయకులు ప్రమాదం సంఘటన పైన మాట్లాడకపోవడం మరియు ఆదుకొనే నాయకులపై అక్కసుతో మాట్లాడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అని అన్నారు. ఇప్పటికైనా ఆ గాయపడిన బాలుడికి అవసరమైన మెరుగైన చికిత్సను ప్రభుత్వమే పూర్తి బాధ్యతతో చేయించాలని అలాగే రమేష్ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా మొర్రి రాజు యాదవ్ డిమాండ్ చేశారు.

# పవన్ నేచర్ క్యూర్ ఉచిత వైద్య శిబిరం.. ఆరోగ్యానికి ఆశాకిరణంగా నిలిచిన సేవా కార్యక్రమం











**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన 'పవన్ నేచర్ క్యూర్ ఉచిత వైద్య శిబిరం' ప్రజల ఆదరణతో విజయవంతంగా ముగిసింది. ఆరోగ్య సేవలు అందరికీ అందాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ ఆరోగ్యాన్ని పరీక్షించించుకున్నారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్యులు ఆప్యాయంగా పరీక్షలు నిర్వహించి, తక్షణ చికిత్సతో పాటు అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పలువురికి అక్కడికక్కడే ఉపశమనం లభించడం ఆశాజనకంగా నిలిచింది. వైద్య సేవలతో పాటు మానవీయ స్పర్శ కలిసిన ఈ కార్యక్రమం ప్రజల హృదయాలను హత్తుకుంది. ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాకం శ్యామ్ బాబు కీలక పాత్ర పోషిస్తూ ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షించారు. వారి అంకితభావం, సేవా తపన ఈ శిబిరాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి దోహదపడింది. ఇదే సందర్భంలో ఆక్యుపంక్చర్ విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, వివిధ అనారోగ్య సమస్యలకు సహజ చికిత్స పద్ధతులను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఆయన సూచనలు, వివరణలు ప్రజల్లో కొత్త నమ్మకాన్ని నింపాయి. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని హర్షిస్తూ, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరుకున్నారు. ఈ శిబిరం కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా, మనుషుల మధ్య మానవీయ అనుబంధాన్ని మరింత బలపరిచిన సేవా యజ్ఞంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# నకిలీ ఏసీబీ అధికారి అరెస్ట్

- ఐదేళ్ల నిరీక్షణకు తెరదించిన ముదిగుబ్బ పోలీసులు



**ఉరవకొండ ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏసీబీ అధికారినంటూ నమ్మించి భారీ స్థాయిలో నగదు వసూలు చేసిన ఘరానా మోసగాడు ఎరుకల హనుమంతు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. సుమారు రూ. 50 లక్షల మేర మోసానికి పాల్పడి, గత ఐదేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న నిందితుడిని ముదిగుబ్బ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు, 2021లో ముదిగుబ్బ తహసీల్దార్ అన్వర్ హుస్సేన్‌ను లక్ష్యంగా చేసుకున్నాడు. తాను ఏసీబీ అధికారినని ఫోన్ ద్వారా పరిచయం చేసుకుని, అవినీతి కేసులు పెడతానంటూ బెదిరింపులకు దిగాడు. భయాందోళనకు గురైన తహసీల్దార్ నుండి సుమారు రూ. 50 లక్షలు వసూలు చేసినట్లు నిందితుడిపై ఆరోపణలు ఉన్నాయి. పోలీసుల ఆపరేషన్:కేసు నమోదైనప్పటి నుండి పరారీలో ఉన్న హనుమంతు కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ పరిధిలో నిందితుడి కదలికలపై అందిన రహస్య సమాచారంతో ముదిగుబ్బ సీఐ శివరాముడు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. నిందితుడి ఫోన్ సిగ్నల్స్, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి పోలీసులు నిఘా పెట్టారు. ఏప్రిల్ 4వ తేదీన పక్కా వ్యూహంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఐదేళ్ల క్రితం నాటి కేసును ఛేదించి, నిందితుడిని కటకటాల వెనక్కి పంపిన సీఐ శివరాముడు మరియు ఆయన బృందాన్ని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు. ప్రభుత్వ అధికారులను బెదిరించి సొమ్ము వసూలు చేసే ఇటువంటి కేటుగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు. ఈ అరెస్ట్‌తో స్థానిక ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం మరింత బలపడింది.

# జగజీవన్ రామ్ ఆశయాల పథంలో యువత నడవాలి: మెట్టుశ్రీధర్

- 118వ జయంతి వేడుకలు నిర్వహణ
- సామాజిక న్యాయం పై దృష్టి
- యువతకు మహానీయుల ఆశయాల పిలుపు



**పటాన్‌చెరు ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగజీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను పటాన్‌చెరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టుశ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగజీవన్ రామ్ చేసిన సేవలు అమూల్యమని అన్నారు. అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం లభించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మహానీయుల విగ్రహాలకు పూలమాలలు వేసే కార్యక్రమాలకు పరిమితం కాకుండా, వారి ఆశయాలను యువతకు చేరవేయాలని పిలుపునిచ్చారు. విద్యా, వైద్య రంగాలు పేదలకు ఉచితంగా అందుబాటులో ఉన్నప్పుడే మరో అంబేద్కర్, మరో జగజీవన్ రామ్ సమాజంలో వెలిసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రుద్రారం శంకర్, అడ్వకేట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వివక్షలేని సమాజమే బాబూజీకి ఇచ్చే నిజమైన నివాళి

### దళిత బాంధవుడు డాక్టర్ బాబు జగజీవన్ రామ్: నున్నా రవికుమార్



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వివక్షలేని సమాజమే బాబూజీకి ఇచ్చే నిజమైన నివాళి అని బిజెపి పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ నున్నా రవికుమార్ అన్నారు. ప్రముఖ స్వతంత్ర సమరయోధులు దళిత బాంధవుడు సమతా వాది సంఘసంస్కర్త మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, రావిగూడెం గ్రామంలో వారి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ నున్నా రవికుమార్ పాల్గొని ఈ సందర్భంగా వారిని స్మరిస్తూ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ పూర్వ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య భారతదేశంలో సామాజిక న్యాయ సాధనకోసం వారు చేసిన కృషి అనుపమానమైనది. వివక్షలు లేని సమాజమే బాబూజీకి ఇచ్చే నిజమైన నివాళి. యువతరం వారి స్ఫూర్తితో వివక్షలు లేని వికసిత భారత నిర్మాణానికి చోదకశక్తులు కావాలని ఆకాంక్షిస్తున్నా వారికి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది. మండల ఉపాధ్యక్షుడు కొండా హర్ష, బీజేవైఎం మండల అధ్యక్షుడు తంగెళ్ల సతీష్, సీనియర్ నాయకులు కాలింగ్ వెంకటేశ్వర్లు పోతనబోయిన శేషగిరి, గోపి సూరేపల్లి ప్రసాద్ మరికొందరు భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం, సమానత్వమే బాబూజీ మార్గం

### - ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్
### - ఆర్టీసీ డిపోలో ఘనంగా బాబూజీ జయంతి వేడుకలు
### సమానత్వ సందేశంతో హృదయాలను హత్తుకున్న కార్యక్రమం




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజిక న్యాయం, సమానత్వమే బాబూజీ మార్గం అని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఖమ్మం డిపోలో భారత మాజీ ఉప ప్రధానమంత్రి, మహానీయ సామాజిక సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఉదయం ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించారు. డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ ఆధ్వర్యంలో డిపో గ్యారేజీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన అపార సేవలను స్మరించుకుంటూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం నేటికీ అందరికీ ప్రేరణగా నిలుస్తోందని డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ పేర్కొన్నారు. కష్టకాలాల్లో అణగారిన వర్గాలకు అండగా నిలిచిన బాబూజీ జీవితం, ఆయన సంకల్పం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, సమాజంలో సమానత్వం కోసం మనమూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఉద్యోగులందరిలోనూ ఒక కొత్త ఉత్సాహం, బాధ్యతా భావం కనిపించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, మెకానికల్ ఫోర్‌మాన్ ప్రవీణ్‌తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని బాబూజీకి ఘన నివాళులు అర్పించారు. ఈ వేడుక కేవలం జయంతి కార్యక్రమంగా కాకుండా, సమానత్వం, సేవా భావం అనే విలువలను గుర్తుచేసే స్ఫూర్తిదాయక సందర్భంగా నిలిచి, పాల్గొన్న ప్రతి ఒక్కరి మనసును హత్తుకుంది.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు

**రామన్నపేట ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ఉప ప్రధాని స్వాతంత్ర సమరయో ధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి మాదిగ మాట్లాడుతూ దేశంలో అత్యధిక కాలం పాటు కేంద్ర మంత్రిగా పనిచేశాడని, వివిధ శాఖలకు మంత్రిగా పనిచేస్తూ దేశానికి అత్యధిక సేవ చేసిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అని ఆయన సేవలను గుర్తు చేశాడు. సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ మాట్లాడుతూ దేశానికి అత్యధిక సేవ చేసిన బాబు జగ్జీవన్ రామ్ కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, ఈర్లపల్లి రమేష్, నల్ల యాదయ్య, మంటి లింగస్వామి, నోముల మల్లేష్, చిప్పలపల్లి జితేందర్, నల్ల రామస్వామి, నోముల కృష్ణ, నల్ల లక్ష్మయ్య, శివ గళ్ళ జ్ఞానేశ్వర్, నల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**రామన్నపేట ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామపంచాయతీ కార్యాలయం లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జగ్జీవన్ రామ్ మన దేశానికి చేసిన సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల రాజకుమార్ వార్డుసభ్యులు నకిరేకంటి నరేష్ , సంద్ల లింగయ్య, జువ్వ గోని మల్లమ్మ, జినుకా ంతి మిరియాల జగన్నాథం, మొగిలి భాగ్య లక్ష్మి, గంజి భాస్కర్, కన్నెబోయిన రాజలింగం గ్రామ ప్రజలు , గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు



# సామాజిక విప్లవకారుడు బాబు జగ్జీవన్ రామ్

### ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు




**ప్రొద్దుటూరు ఏప్రిల్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత మాజీ ఉపప్రధాని, నవభారత నిర్మాణ శిల్పి బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఆదివారం జమ్మలమడుగు పట్టణంలో దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఘన నివాళులు పట్టణంలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి మాల ,మాదిగ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. భారతదేశ అభివృద్ధిలో, ముఖ్యంగా సామాజిక సమానత్వం కోసం జగ్జీవన్ రామ్ చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, వారి ఆర్థిక, సామాజిక ఎదుగుదల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. దళిత నాయకుడు పాలాజీ వెంకటస్వామి మాట్లాడుతూ ఆయన ఆశయాలను కొనసా గించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారుఈ కార్యక్ర మంలో ప్రముఖ దళిత సైమన్,నియోజకవర్గ ఇన్చార్జ్ చిన్నయ్య, దళిత నాయకులు సాల్మన్, దేవదానం, పాలాజీ వెంకటస్వామి, మేకల పుట్టా రవి, కేవన్ రాజు, కైపు భాస్కర్, హరికృష్ణ, నాగరాజు ఓబులేసు, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక





# ఆ హీరో నన్ను తిట్టాడు.. ఆరోజు చాలా గొడవ జరిగింది.. షాకింగ్ విషయం చెప్పిన జేడీ చక్రవర్తి

నటుడు జేడీ చక్రవర్తి తన కెరీర్‌లోని పలు ఆసక్తికరమైన సంఘటనలను, ముఖ్యంగా తన బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ గా భావించిన వాటిని గతంలో ఒక ఇంటర్వ్యూలో వివరించారు. వాటిలో నాగార్జునతో శివ చిత్రం షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటన కీలకం. ఈ సంఘటన హైలైట్ కేఫ్‌లో చోటుచేసుకుంది. జేడీ చక్రవర్తి కొత్త నటుడిగా తన మొదటి సినిమా షూటింగ్‌లో ఉండగా, నాగార్జున గారు అప్పటికే స్టార్‌డమ్‌లో ఉన్నారు. ఆయన బయటికి వస్తుండగా జేడీ చక్రవర్తి అనుకోకుండా ఢీకొన్నారట. దీనిపై నాగార్జున కోపంగా మాట్లాడటం, చూసుకొని నడవవా.? అని అనడం, అనంతరం జేడీ చక్రవర్తిని కొట్టడం జరిగిందని వివరించారు. మొదట అది ఒక పెద్ద గొడవగా, బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ గా అనిపించినప్పటికీ, ఇది నిజానికి ముందుగా ప్రణాళిక చేసిన ఒక ఫైట్ సీక్వెన్స్ అని జేడీ చక్రవర్తి వెల్లడించారు.అప్పుడు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, గోపాల్ రెడ్డిలు ఈ సన్నివేశాన్ని క్యాండిడ్‌గా చిత్రీకరించాలని నిర్ణయించారని, ఇది శివ సినిమాలో ఇరానీ కేఫ్ ఫైట్‌గా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. ఈ సంఘటన కేవలం సినిమా చిత్రీకరణలో భాగంగా జరిగిందని, అందుకే ఇది గుడ్ ఎక్స్‌పీరియన్స్ అని అన్నారు. అయితే, తన అసలైన బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ హీరోయిన్ ఆమలతో జరిగిన ఒక ఇబ్బందికర సంఘటన అని జేడీ చక్రవర్తి పేర్కొన్నారు. శ్రీదేవి తర్వాత తాను ఎక్కువగా ఆరాధించే నటి అమల అని ఆయన తెలిపారు. ఒక సన్నివేశం చిత్రీకరణ జరుగుతున్నప్పుడు, పాఠశాల నుంచి ఎవరో ఒక అమ్మాయిపై రాళ్లు విసురుతున్నారని జేడీ చక్రవర్తి గమనించారు. అమల అప్పటికే పుష్పక్ వంటి చిత్రాలలో నటించి తనకు ఎంతో అభిమానమని, అందుకే ఆ విషయం చెప్పడానికి ఉత్సాహంగా అమల వద్దకు వెళ్లినప్పుడు, తాను చెప్పదలచుకున్న విషయాన్ని సరిగ్గా వ్యక్తం చేయలేకపోయానని అన్నారు.

సమ్మర్ సమ్మర్, సో అండ్ సో అని తడబడినప్పుడు, అమల ఎవరో రాళ్లు విసురుతున్నారని చెప్పదలుచుకున్నారా?" అని ప్రశ్నించడం తనకు చాలా అవమానకరంగా, ఇబ్బందికరంగా అనిపించిందని జేడీ చక్రవర్తి గుర్తుచేసుకున్నారు. ఇవి కాకుండా, వ్యతిరేకతను కూడా వెల్లడించారు. తెలుగు భాషలో తనకు ఇష్టం లేని ఏకైక పదం అన్నయ్య అని ఆయన స్పష్టం చేశారు. బావ అనే పదంపై ఎక్కువ జేడీ చక్రవర్తికి అన్నయ్య అనే పదంపై ఉన్న వ్యతిరేకతను కూడా వెల్లడించారు. తెలుగు భాషలో తనకు ఇష్టం లేని ఏకైక పదం అన్నయ్య అని ఆయన స్పష్టం చేశారు. బావ అనే పదంపై ఎక్కువ ఇష్టం ఉందని పేర్కొన్నారు. అలాగే, నాగార్జున హీరోగా నటించిన సినిమాలో తాను మొదటిసారి నటించగా, నాగచైతన్య హీరోగా ఉన్న జోష్ చిత్రంలో విలన్‌గా చేశానని తెలిపారు. ఈ సంఘటనలన్నీ తన సినిమా ప్రయాణంలో భాగమేనని జేడీ చక్రవర్తి వివరించారు.


# అందాల ముద్దుగుమ్మ రిద్ధి కుమార్..

ఈ అమ్మడు రాజ్ తరుణ్ హీరోగా నటించిన లవర్ అనే సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. లవర్ సినిమాలో అందం, అభినయంతో కట్టిపడేసింది రిద్ధి కుమార్. చాలా కాలం గ్యాప్ తీసుకున్న తర్వాత ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ సినిమాలో కీలకపాత్రలో కనిపించింది.ఈ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. రాధేశ్యామ్ సినిమాలో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఈ బ్యూటికి అనుకున్నంతగా అవకాశాలు కూడా టాలీవుడ్ లో రావడం లేదు.

ఈ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. రాధేశ్యామ్ సినిమాలో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఈ బ్యూటికి అనుకున్నంతగా అవకాశాలు కూడా టాలీవుడ్ లో రావడం లేదు.ఇటీవలే ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాబ్ సినిమాలో నటించింది. రాజా సాబ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రాజాసాబ్ సినిమాలో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది ఈ సుందరి. ఇటీవలే ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాబ్ సినిమాలో నటించింది. రాజా సాబ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రాజాసాబ్ సినిమాలో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది ఈ సుందరి. కానీ తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అలాగే అటు మలయాళంలోనూ వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. నెట్టింట గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కవ్విస్తుంది. కానీ తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అలాగే అటు మలయాళంలోనూ వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. నెట్టింట గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కవ్విస్తుంది. కెరీర్ తొలినాళ్లలో ఈబ్యూటీ గ్లామర్ రోల్స్ చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ భామకు అవకాశాలు అంతగా రావడం లేదని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం గ్లామర్ రోల్స్ లోనూ కనిపిస్తూ మెప్పిస్తుంది రిద్ధి కుమార్.

కెరీర్ తొలినాళ్లలో ఈబ్యూటీ గ్లామర్ రోల్స్ చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ భామకు అవకాశాలు అంతగా రావడం లేదని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం గ్లామర్ రోల్స్ లోనూ కనిపిస్తూ మెప్పిస్తుంది రిద్ధి కుమార్.






# దుమ్మురేపిన డెకాయిట్ ట్రైలర్.. అడవి శేష్ ఇరగదీశాడబ్బా..!

యంగ్ హీరో అడవి శేష్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ డెకాయిట్. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు అడవి శేష్. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఇప్పుడు డెకాయిట్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమా నుంచి తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సినిమా ట్రైలర్ సినిమా పై అంచనాలు పెంచేసింది.డెకాయిట్ కథ ఒక మాజీ ప్రేమ జంట చుట్టూ తిరుగుతుంది. ఒకప్పుడు ఒకరినొకరు ప్రేమించిన ఈ జంట, అనుకోని పరిస్థితుల వల్ల విడిపోతారు. ఆ తర్వాత జరిగిన సంఘటనల వల్ల ఒకరు జైలుకి వెళ్ళడం, మరొకరి ద్రోహం వంటి అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ట్రైలర్ లో స్టంట్స్ చాలా నేచురల్‌గా ఉండటం, సినిమాకు ఒక హాలీవుడ్ తరహా ఫీల్ ఇస్తుంది. ట్రైలర్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా కీలక పాత్ర పోషించింది. డార్క్ టోన్‌కు సరిపోయేలా మ్యూజిక్ ఉండటం వల్ల ప్రతి సీన్ మరింత ఇంపాక్ట్‌ఫుల్‌గా కనిపిస్తుంది. విజువల్స్ కూడా స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా ఉండటం సినిమా క్వాలిటీని తెలియజేస్తుంది.ఈ ట్రైలర్ చూసినటి అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ట్రైలర్ లో స్టంట్స్ చాలా నేచురల్‌గా ఉండటం, సినిమాకు ఒక తర్వాత, సినిమా మీద ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగిందని చెప్పాలి.ఇక అడవి శేష్‌కు జోడీగా ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుంది. షానీల్ డియో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. అన్నపూర్ణ స్టూడియోస్ ఓ సోనీ పిక్చర్స్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్ లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఏప్రిల్ 10న డెకాయిట్ సినిమా గ్రాండ్ గా విడుదలకానుంది

# దడపుట్టించే సైకో క్రైమ్ థ్రిల్లర్ ఇది.. చూడటం మొదలు పెడితే కళ్ళు తిప్పరంతే




ప్రస్తుతం ఓటీటీలో సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలదే హవా. భాషతో సంబంధం లేకుండా ఈ జానర్ సినిమాలు, సిరీస్ లను చూసేస్తున్నారు ఆడియెన్స్. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు కూడా ఇంట్రెస్టింగ్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలు, వెబ్ సిరీస్ లను ఆయా భాషల్లోకి అనువాదం చేసి మరీ స్ట్రీమింగ్ కు తీసుకొస్తున్నాయి. అలా కొన్ని రోజుల క్రితం ఓటీటీలోకి వచ్చిన ఓ వెబ్ సిరీస్ టాప్ ట్రెండింగ్ లో కొనసాగుతోంది. సాధారణంగా ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్ల మూవీస్, వెబ్ సిరీస్ లలో కిల్లర్ లేదా క్రిమినల్ ఎవరన్నది చివరి దాకా రివీల్ చేయరు. కానీ ఈ సిరీస్ లో మాత్రం రెండో ఎపిసోడ్ లోనే సీరియల్ కిల్లర్ ను రివీల్ చేస్తారు. అతను హత్యలు ఎలా చేస్తున్నాడో చూపిస్తారు. అయినా ఈ సిరీస్ ఆసక్తిని కోల్పోదు. ఈ సిరీస్ కథ మొత్తం ఓ సీరియల్ కిల్లర్ కేసు చుట్టూనే తిరుగుతుంది. అతి చిన్న వయస్సులో ముంబై నగరానికి డీసిపి అయిన రీటా ఫెరారియా ఈ కేసును ఒక ఛాలెంజింగ్ గా తీసుకుంటుంది. ఉన్నట్లుండి నగరంలో వరుసగా హత్యలు జరుగుతూ ఉంటాయి. ఆ హత్యలు కూడా ఒకే పంథాలో జరుగుతుంటాయి. ఓ సీరియల్ కిల్లర్ పోలీసులకు ఒక చిన్న క్లూ కూడా వదలకుండా చాలా పకడ్బందీగా ఈ మర్డర్లు చేస్తుంటాడు.



టాలీవుడ్ లో కొత్త అందాలు ప్రేక్షకులను కవ్విస్తున్నాయి. సినిమా సినిమాకు కొత్త కొత్త అందాలు ప్రేక్షకులను కవ్విస్తున్నాయి. ఈ క్రమంలోనే ముద్దుగుమ్మ శివాని నాగరం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఈ అమ్మడు కేవలం నటి మాత్రమే కాదు గాయని , కూచిపూడి నృత్యకారిణి కూడా.ఈ ముద్దుగుమ్మ 2024లో విడుదలైన "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంలో ఆమె సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.ఈ ముద్దుగుమ్మ 2024లో విడుదలైన "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంలో ఆమె సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది.శివాని ఈ అవకాశాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన ఆడిషన్ మెసేజ్ ద్వారా పొందింది, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం వెళ్లి, తర్వాత హీరోయిన్‌గా ఎంపికైంది. ఇక ఇటీవలే ఈ సుందరి లిటిల్ హార్ట్స్ అనే సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.శివాని ఈ అవకాశాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన ఆడిషన్ మెసేజ్ ద్వారా పొందింది, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం వెళ్లి, తర్వాత హీరోయిన్‌గా ఎంపికైంది. ఇక ఇటీవలే ఈ సుందరి లిటిల్ హార్ట్స్ అనే సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.అంతేకాకుండా, శివాని గాయనిగా కూడా తన ప్రతిభను చూపించింది, ఆరంభం అనే సినిమాలో అమాయకంగా అనే పాటను ఆలపించింది, ఇది ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ.. తన ఫొటోలతో అభిమానులను ఆకర్షిస్తోంది.అంతేకాకుండా, శివాని గాయనిగా కూడా తన ప్రతిభను చూపించింది, ఆరంభం అనే సినిమాలో అమాయకంగా అనే పాటను ఆలపించింది, ఇది ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ.. తన ఫొటోలతో అభిమానులను ఆకర్షిస్తోంది.ఆమె మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటుంది ఈ భామ. ఇటీవలే సుహాస్ సరసన హే బలవంత్ అనే సినిమాలో నటించింది. ఆమె తన సహజమైన అందం, నటనా నైపుణ్యంతో యువతలో మంచి క్రేజ్ సొంతం చేసుకుంటుంది. శివాని హైదరాబాద్‌కు చెందిన తెలుగు అమ్మాయి. తెలుగు నటీమణులకు సినిమా రంగంలో మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటుంది ఈ భామ. ఇటీవలే సుహాస్ సరసన హే బలవంత్ అనే సినిమాలో నటించింది.

# క్యూట్ బ్యూటీ శివాని నాగారం అదరగొట్టిందిగా

శివాని